క్లుప్తంగా

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైలదేవస్థానం ప్రాంగణం లోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి గురువారం విశేష పూజలను దేవస్థానం అధికారులు, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

7న సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 7న మార్గశిర శుద్ధ షష్ఠిని పురస్కరించుకుని సుబ్రహ్మణ్యషష్ఠి మహోత్సవం నిర్వహించనున్నట్లు దేవస్థాన ఈఓ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఉత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగాణంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి (కుమారస్వామి) ఉదయం 8గంటలకు విశేష అభిషేకం, విశేష అర్చనలు జరిపిస్తారన్నారు. 9 గంటలకు హోమం అనంతరం పూర్ణాహుతి జరిపిస్తారని అన్నారు.

భూ సమస్యలను పరిష్కరించుకోవాలి

నందికొట్కూరు: మండలంలో ఈ నెల 6వ తేదీ నుంచి నిర్వహించే రెవెన్యూ సదస్సులలో భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు చెప్పారు. గురువారం పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 6వ తేదీ నుంచి జనవరి 7వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. 6వ తేదీన నాగటూరు, 10న మల్యాల, 13న నందికొట్కూరు పట్టణం, 17న కొణిదేల, 19న అల్లూరు, 21న శాతనకోట, 24న వడ్డేమాన్, 26న కోనేటమ్మ పల్లి, కోళ్లబావాపురం, 28న బ్రాహ్మణకొట్కూరు, 31న బిజినవేముల గ్రామాల్లో సదస్సులు ఉంటాయన్నారు. అదేవిధంగా జనవరి 2న 10 బొల్లవరం, 4న మద్దిగట్ల, 7న దామగట్ల గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని వివరించారు.

నేడు మండల మీట్

కొత్తపల్లి: కొత్తపల్లి మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మేరి తెలిపారు. ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించే మండల మీట్‌లో గ్రామాల అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తామన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు



పోలీసులు స్వాధీనం చేసుకున్న నాటు సారా, సామగ్రి

నందికొట్కూరు: నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు నాయక్, ఎస్ఐ జఫ్రుల్లా హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని నీలిషికారిపేటలో నాటు తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లం ఊటను పోలీసులు ధ్వంసం చేశారు. 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టానికి వ్యతిరేకంగా నాటు సారాయి తయారు చేయడం నేరమన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ శంకర్ నాయక్, పోలీసులు శివన్న, సుధీర్, మధుప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు చెక్కుల పంపిణీ



రైతుకు చెక్కు అందజేస్తున్న ఫారెస్ట్ అధికారులు

వెలుగోడు: అడవి జంతువుల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు గురువారం స్థానిక ఫారెస్ట్ రేంజర్ కార్యాలయంలో ఫారెస్ట్ అధికారులు చెక్కులు పంపిణీ చేశారు. రేంజర్ ఎంపీ ఖాన్ మాట్లాడుతూ ఇటీవల నల్ల కాలువ గ్రామంలో రైతుల మొక్కజొన్న పంటలను అడవి జంతువులు నాశనం చేయడంతో రైతులు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో 18 మంది రైతులకు రూ.53,200 పరిహారం అందజేసినట్లు తెలిపారు. అడవి జంతువుల వల్ల పంటలకు నష్టం జరిగినా వాటికి ఎటువంటి హాని చేయవద్దని సూచించారు. నష్టపోయిన వారికి నష్టపరిహారం అందిస్తామని రేంజర్ వివరించారు. అలాగే వన్యప్రాణులను వేటాడే వారి సమాచారం అందిస్తే వారి పేర్లను గోప్యంగా ఉంచి వారికి పారితోషకం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారులు గోపి, సుజాత, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రైతులకేదీ ధీమా?

- ఉచిత పంటల బీమా అమలు చేయని కూటమి ప్రభుత్వం
- ప్రీమియం చెల్లిస్తేనే బీమా వర్తింపు
- గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు ఒక్క రూపాయి లేకుండా బీమా



ఆత్మకూరు మండలంలో సాగుచేసిన వరి

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వంలో రైతన్నలకు గోరు పోటుపై రోకలి పోటులా పరిస్థితులు దాపరించాయి. రైతులు అనునిత్యం కష్టాన్ని నమ్ముకుని వివిధ పంటలను సాగుచేస్తే పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం, ప్రభుత్వం అన్నదాత సుఖీభవ (రైతుకు భరోసా సాయం) అందకపోవడంతో రైతన్నలు అప్పులపాలవుతున్నారు. దీనికి తోడు కూటమి ప్రభుత్వం ఉచిత పంటల బీమా అమలు చేయకపోవడంతో, బీమా ప్రీమియం రైతులే చెల్లించాలని చెప్పడంతో అన్నదాత పరిస్థితి స్థితి అగమ్యగోచరంగా మారింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఉచిత పంటల బీమా అమలు చేసి, పరిహారం కూడా అందించిందని రైతులు గుర్తుచేసుకుంటున్నారు.

ఈనెల 15వ తేదీ దాటితే బీమా వర్తించదు

ఆత్మకూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో రబీ సీజన్‌కు గాను వరి 7,986 ఎకరాలు, మినుము 12,492, మొక్కజొన్న 6,750, కంది 2,570 ఎకరాల్లో సాగు చేశారు. ఈనెల 15వ తేదీ దాటితే వివిధ పంటలకు బీమా చెల్లించే పరిస్థితి కనిపించడం లేదు. ప్రధానంగా మొక్కజొన్న, మినుము, వేరుశనగ, కంది లాంటి పంటలకు డిసెంబర్ 10వ తేదీవరకే గడువు విధించారు. కాగా వరి పంటకు ఈనెల చివరి వరకు గడువు ఉన్నప్పటికీ రైతులకు మాత్రం ప్రీమియాన్ని తప్పనిసరిగా చెల్లించే పరిస్థితి నెలకొంది. పంటల బీమాను పరిశీలిస్తే అన్నదాతలు తప్పనిసరిగా ఈనెల 10వ తేదీ నాటికి కందికి రూ.215, వరికి రూ.315, జొన్నలకు రూ. 149, మినుముకు రూ.118, వేరుశనగకు రూ.160, ఉల్లికి రూ.225 చొప్పున ప్రీమియం చెల్లించాల్సి ఉంది. అది కూడా గడువులోగా చెల్లిస్తేనే బీమా వర్తిస్తుంది.

అవగాహన కల్పించడంలో వ్యవసాయ సిబ్బంది విఫలం

ఆరుగాలం శ్రమించే రైతన్నలకు ప్రభుత్వం అందిస్తున్న పంటలబీమా పథకంపై వ్యవసాయ సిబ్బంది అవగాహన కల్పించడంలో విఫలమయ్యారు. రైతులు బీమా చెల్లిస్తేనే పంటలబీమా ఉంటుందని స్పష్టంగా తెలియకపోవడంతో పలువురు రైతులు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆ ప్రభుత్వమే పంటల బీమా చెల్లించిందని.. ఇప్పుడు కూడా అలాగే జరుగుతుందని భావిస్తున్నారు. కానీ కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వంలాగా ప్రీమియం చెల్లించడం లేదు. దీంతో పంటల బీమా అందక రైతులు నష్టపోయే అవకాశం ఉంది. ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లలో వేలాది ఎకరాల్లో మొక్కజొన్న, మినుము, వరి పంటలు దెబ్బతిన్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు పంటలబీమా ఎంతో అవసరం ఉంది. అలాంటి బీమా సైతం ప్రభుత్వం అందించకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. కనీసం వ్యవసాయ అధికారులైనా రైతన్నలను చైతన్యపరిచేలా ప్రీమియంపై వివరించి అవగాహన కల్పిస్తే కొందరు రైతులైనా బీమా చేయించుకొని లబ్ధి పొందే అవకాశం ఉంది. లేకపోతే ఈ ఏడాది రైతులు పంటలబీమా కోల్పోయే అవకాశం ఉంది.

ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలాగే కూటమి ప్రభుత్వం కూడా రైతులకు బీమా ప్రీమియాన్ని చెల్లించాలి. అలాగే రైతులకు బీమాపై అధికారులు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలి. ప్రకృతి అనుకూలించకపోవడంతో ఈ ఏడాది వరుణుడి ఆగ్రహం వల్ల మొక్కజొన్న, మినుము, వరి పంటలు దెబ్బతిన్నాయి. రైతులకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తే బీమా ద్వారా నష్టపరిహారం అందితే ఎంతగానో ఊరట కలిగిస్తోంది.

– నాగేశ్వర్‌రెడ్డి, ఆత్మకూరు రైతు

రైతులకు గడువు విధించడం సరికాదు



రైతులు సాగుచేసిన వివిధ పంటలకు బీమా చెల్లింపు విషయంలో కూటమి ప్రభుత్వం ఈనెల 15వ తేదీ వరకు గడువు విధించడం సరికాదు. రైతులు పంటల బీమా చెల్లించకపోతే నష్టపరిహారం కోల్పోవాల్సి వస్తుంది. ప్రభుత్వ కొత్త విధానాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతులే నేరుగా ప్రీమియం చెల్లించాలంటే కష్టమవుతుంది. బీమా గడువును పెంచాలి.

– హనుమంతరెడ్డి, ఆత్మకూరు రైతు

బాలిక మృతి కారకులను కఠినంగా శిక్షించాలి



పటేల్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న ఏఐటీయూసీ, ఏఐఎస్ఎఫ్ నాయకులు

నందికొట్కూరు: ఉర్దూ ప్రాథమిక పాఠశాల ప్రహరీ కూలి మృతి చెందిన బాలిక బాలిక షేక్ అస్త మహిన్(7) కుటుంబానికి న్యాయం చేయాలని విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు రఘురామమ్మూర్తి, ఆది డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఏఐఎస్ఎఫ్, ఏఐటీయూసీ, పీడీఎస్‌యూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పటేల్ సెంటర్‌లో బాలిక మృతికి కారణమైనవారిని చట్ట పరంగా శిక్షించాలని రాస్తారోకో నిర్వహించారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఎంఈఓ కార్యాలయం ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉర్దూ ప్రాథమిక పాఠశాలకు కనీసం సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రహరీ కూలే పరిస్థితితో ఉన్నా పట్టించుకోని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తాగునీటి పైపులకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్

జూపాడుబంగ్లా: 'తాగునీరు కలుషితం' శీర్షికన బుధవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఏఈ నాగేంద్ర, సర్పంచ్ మొట్టె బాలయ్య స్పందించారు. గురువారం తాగునీటి పైపులు లీకేజీ అవుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. వెంటనే జేసీబీని రప్పించి సుమారు 50మీటర్ల మేర నూతన పైపులైన్‌ను ఏర్పాటు చేయించారు. తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టారు. నేషనల్‌హైవే 340సీ రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్ల కారణంగా పైపులైన్ మరమ్మతులకు గురయ్యాయని ఏఈ నాగేంద్ర తెలిపారు. వారి సహకారంతోనే తాగునీటి పైపులకు మరమ్మతులు చేయించామని, నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేశామని తెలిపారు.



నూతన పైపులైన్ నిర్మాణం పనులు చేయిస్తున్న ఏఈ నాగేంద్ర, సర్పంచ్ బాలయ్య

కార్తీకమాస శివదీక్ష విరమణకు ఏర్పాట్లు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు కార్తీకమాస శివదీక్షా విరమణ కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని శ్రీశైల దేవస్థాన ఈఓ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఈఓ మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం ఐదు రోజుల పాటు పాతాళగంగ మార్గములోని శివదీక్షా శిబిరాలలో దీక్ష విరమణ కార్యక్రమానికి ఏర్పాట్లు చేశామన్నారు. నవంబరు 2న శివమండల దీక్షను, 21న అర్ధమండలదీక్షను స్వీకరించిన భక్తులు దీక్షను విరమించవచ్చునని చెప్పారు. దీక్షావిరమణ సందర్భంగా 11వ తేదీ ఉదయం 7.30గంటలకు స్వామివారి ఆలయ దక్షిణద్వారం వద్ద స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులను చేయించి విశేష పూజలు నిర్వహిస్తామన్నారు. అనంతరం స్వామిఅమ్మవార్లను ఊరేగింపుగా తీసుకెళ్లి శివదీక్ష శిబిరాలలో ఆశీనులను చేస్తారని తెలిపారు.

యువగళంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

శ్రీశైలంప్రాజెక్ట్: 2024 ఎన్నికల ముందు యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేష్ నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు నెరేర్చాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాముడు డిమాండ్ చేశారు. గురువారం సున్నిపెంటలోని శ్రీశైలనెస్ట్ హాల్‌లో జరిగిన ఏఐవైఎఫ్ ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగులకు తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రంలోని వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేస్తామని లోకేష్ హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు దాటుతున్నా నిరుద్యోగులకు ఇచ్చిన హామీల అమలుకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకుంటే ప్రతి నిరుద్యోగికి నెలకు రు.5,000 భృతిగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో ఏఐవైఎఫ్ నాయకులు బి.లక్ష్మయ్య, మల్లేష్, మహేష్, అంజి, నవీన్, గాలెయ్య, శివ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ గ్రామసభలు

బండి ఆత్మకూరు : భూ సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ గురునాథం తెలిపారు. 6న బండి ఆత్మకూరు, 10న ఈర్నపాడు, 11న జి.పి.పాలేం, 12న రామాపురం, 13న కడమల కాలువ, 18 న భోజనం, 19న పరమదూరు, 20న సంతజూటూరు, 21న పెద్ద దేవళాపురంలో సభలు ఉంటాయన్నారు.

మిడుతూరు: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో శుక్రవారం నుంచి జనవరి 7వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. 6వ తేదీన వీపనగండ్ల, 10న రోళ్లపాడు, 13న తలముడిపి, 17న బైరాపురం, 18న దేవనూరు, 19న మిడుతూరు, 20న చౌట్కూరు, 21న జలకనూరు, 24న సుంకేసుల, 26న కడుమూరు, 27న చింతలపల్లి, 28న నాగలూటి, 31వ తేదీన 49-బన్నూరు గ్రామంలో సదస్సులు ఉంటాయన్నారు. అదేవిధంగా జనవరి 2న తిమ్మాపురం, 3న చెరుకుచెర్ల, 4న మాసపేట, 7న అలగనూరు గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని వివరించారు.

వెలుగోడు: రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస గౌడ్ అన్నారు. శుక్రవారం నుంచి వెలుగోడు మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 6న వెలుగోడు, 10న వేల్పనూరు, 13న మోత్కూరు, 17న మాధవరం, 19న తుమ్మనపల్లి, 21న అబ్దుల్లాపురం, 24న గుంత కందాల, 26న రేగడ గూడూరు, 28న గట్టుతండా, జనవరి 2న బోయ రేవుల, 4న అయ్యవారిపల్లి గ్రామంలో సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పగిడ్యాల: మండలంలో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శివరాముడు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సదస్సులు నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 6వ తేదీన పగిడ్యాల, 10న లక్ష్మాపురం, 13న నెహ్రూనగర్, 17న పాత ముచ్చుమర్రి, 19న కొత్త ముచ్చుమర్రి, 21న లక్ష్మాపురం 2, 27న లక్ష్మాపురం 3 సచివాలయం, జనవరి 3న పడమర ప్రాతకోట సచివాలయాల్లో రెవెన్యూ సదస్సులు ఉంటాయని వివరించారు.

మద్యం దుకాణం వద్దే 'సిట్టింగ్'

జూపాడుబంగ్లా: మద్యం దుకాణం వద్దనే మద్యం ప్రియులు సిట్టింగ్ మూలంగా కాసానగర్ కాలనీకి వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతన్నారు. కాసానగర్ కాలనీకి వెళ్లే దారి పక్కన్నే మద్యం దుకాణం ఏర్పాటు చేశారు. దుకాణం నిర్వాహకుడు చుట్టూ గ్రీన్‌మ్యాట్ ఏర్పాటు చేశారు. దీంతో అడ్డుగా చేసుకొని మద్యం దుకాణం వెనకాల, సమీప ప్రాంతంలోని వాటర్ ప్యాకెట్ దుకాణం వద్ద కూర్చొని మద్యం సేవిస్తున్నారు. విషయాన్ని ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు దృష్టికి తీసుకెళ్లగా దుకాణాల వద్ద మద్యం సేవించ కూడదన్నారు. దుకాణం దారుడు మద్యం సేవించే వారికి కుర్చీలు, టేబుళ్లు వేసినట్లయితే చర్యలు తీసుకుంటామన్నారు. అలాకాకుండా కిందకూర్చుని మద్యం సేవిస్తున్నట్లయితే చర్యలు తీసుకోలేమని తెలిపారు.

అన్నప్రసాద విభాగాన్ని పరిశీలించిన ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ విభాగాన్ని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు పరిశీలించారు. గురువారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన అన్నప్రసాద వితరణ భవనంలోని భోజనశాలలు, పాకశాల, కూరగాయలు నిల్వచేసే కోల్డ్ స్టోరేజ్ గది, స్టోర్ తదితర వాటిని సందర్శించారు. అన్నప్రసాదాల వితరణలో వండుతున్న రోజువారీ వంటల వివరాలు తెలుసుకుని, వండిన వంటలను పరిశీలించారు. వంటశాలను, భోజనశాలను, అన్నప్రసాద వితరణ ప్రాంగాణమంతా ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తుండాలని సూచించారు. భక్తులతో ముఖాముఖిగా సంభాషించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించి, క్షేత్ర పరిధిలోని వివిధ చోట్ల ఏర్పాటు చేయబడిన సీసీ కెమెరాల వివరాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులతో మాట్లాడుతున్న ఈఓ

కృష్ణా నదిఒడ్డున గుర్తుతెలియని మృతదేహం

కొత్తపల్లి: నల్లమల అటవీ ప్రాంతంలోని కృష్ణానది ఒడ్డున ఓ గుర్తుతెలియని శవం లభ్యమయిందని ఎస్ఐ ఎం. కేశవ గురువారం తెలిపారు. మండల పరిధిలోని ఎర్రమఠం గ్రామం పొలిమేర కృష్ణానది ఒడ్డున ఉన్న వీరభద్రదుర్గం గ్రామం దగ్గర గరిగల దిన్నె ప్రాంతంలో శ్రీశైలం వెనుక జలాలలో గుర్తు తెలియని శవాన్ని గుర్తించారన్నారు. ఆ ప్రదేశానికి విధులు నిర్వహించేందుకు వెళ్లిన ఫారెస్ట్ అధికారి కావేరి స్థానిక పోలీస్ స్టేషన్‌కు కృష్ణానది ఒడ్డున ఓశవం ఉందని సమాచారం ఇచ్చారన్నారు. సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని నదిఒడ్డున పడిన మృతదేహాన్ని పరిశీలించామన్నారు. ఆ మృతదేహం నాలుగు రోజుల క్రితం పడినట్లుగా ఉందని తెలిపారు. నంద్యాల ప్రభుత్వ వైద్యులను పిలిపించి అక్కడే పోస్టుమార్టం చేయించామన్నారు. ఆవ్యక్తి మరణానికి గల కారణం తెలియలేదని, 50 నుండి 60 ఏళ్ల మధ్య వయసు ఉంటుందన్నారు. క్రీమ్ కలర్ ఫుల్ షర్ట్ (చొక్కా), బూడిద రంగు నిక్కరు ధరించినాడని, చేతికి పూసల బ్యాండ్, నలుపురంగు దారం ఉందని వివరించారు. చనిపోయిన వ్యక్తి గురించి ఏదైనా సమాచారం తెలిసి ఉంటే పోలీస్ స్టేషన్‌కు 9121101185 సమాచారం తెలియజేయాలని సూచించారు. ఫారెస్టు అధికారి కావేరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బండిఆత్మకూరు తహసీల్దార్‌గా పద్మావతి



బాధ్యతలు స్వీకరించిన పద్మావతి

బండి ఆత్మకూరు: మండల తహసీల్దార్ ధోనీ ఆల్ఫ్రెడ్ ఆకస్మికంగా నంద్యాల కలెక్టర్ కార్యాలయానికి డిప్యూటేషన్‌పై వెళ్లడంతో.. ఆయన స్థానంలో అన్నమయ్య జిల్లా నుంచి పద్మావతి నియమించారు. ఈ మేరకు ఆమె గురువారం బాధ్యతలు స్వీకరించారు.

రేపు మెగా పేరెంట్స్ సమావేశం

మహానంది: మహానందిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఈ నెల 7వ తేదీన మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ పాఠశాల హెచ్ఎం అంబమ్మ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులు హాజరు కావాలన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం అందించే కార్డులను పంపిణీ చేస్తామని చెప్పారు.

సీపీఎం ప్రచారజాతను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

నందికొట్కూరు: ఈ నెల 7, 8, 9 తేదీల్లో జరిగే జీపుజాత కార్యక్రమం విజయవంతం చేయాలని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 9, 10 తేదీల్లో జరిగే నంద్యాల జిల్లా మహాసభలను జయప్రదం చేసేందుకు చేపట్టిన ప్రచార జీపుజాతను విజయవంతం చేయాలన్నారు. జీపుజాతకు సీపీఎం నాయకులు, కార్యకర్తలు సహకరించాలని కోరారు. సమావేశంలో సీపీఎం నాయకులు గోపాలకృష్ణ, కర్ణ, ఖాజాబాషా, ఉస్మాన్‌బాషా, జయ, వెంకటేశ్వర్లు, లింగస్వామి, హర్షవర్ధన్, రాము, శివ, పాండు, మద్దమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బాలిక కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

నందికొట్కూరు: బాలిక మరణానికి ప్రభుత్వం బాధ్యత వహించాలని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దారా సుధీర్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఉర్దూ స్కూల్ కాంపౌండ్ కూలి మృతి చెందిన బాలిక షేక్ అస్త మహిన్(7) ఇంటికి గురువారం ఆయన వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తమవంతు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలిక మరణం కుటుంబానికి తీరని లోటని, ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేసి ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని గుర్తు చేశారు. అయితే కూటిమి ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తుందని, పాఠశాలల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈయన వెంట కౌన్సిలరు నాయబ్, శాతనకోట సర్పంచ్ జనార్దన్‌గౌడు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మన్సూర్, నాయకులు ఉపేంద్రారెడ్డి, శ్రీకాంత్, జబ్బార్, అబుబక్కర్, లక్ష్మిరెడ్డి, రవి, లడ్డు, సలాంఖాన్ తదితరులు ఉన్నారు.



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దారా సుధీర్

ప్రభుత్వం అసంబద్ధ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఉద్యమం

నందికొట్కూరు: ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఉద్యమించక తప్పదని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, కార్యదర్శి ముర్తుజావలి, వెంకటప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం పట్టణంలోని మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులపై పని భారం పెంచడం దుర్మార్గమన్నారు. పదో తరగతి విద్యార్థుల సంసిద్ధత పేరుతో ఇటీవల విడుదల చేసిన కార్యచరణ ప్రణాళిక ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేస్తుందని వాపోయారు. ఈ నెల 11వ తేదీన జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట తలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎంఈఓ సుభాన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉద్యోగం సంఘం నాయకులు సత్యనారాయణ, రాముడు, ఇలియాస్‌బేగ్, వాసు, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, వెంకటరమణ, నాగరాజు, రహిమాన్, జయసూర్య, రాజు, జగదీష్, చిన్న మూర్తుజావలి, అబ్దుల్ సత్తార్, తదితరులు పాల్గొన్నారు.



ఎంఈఓకు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగ సంఘం నాయకులు

భావితరాల కోసం నేలను పరిరక్షించాలి

మహానంది: భావితరాల కోసం నేలలను పరిరక్షించాలని మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వీర జయలక్ష్మి తెలిపారు. వ్యవసాయ కళాశాలలో గురువారం ప్రపంచ నేలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో పెరిగిపోతున్న కాలుష్యం వల్ల, రసాయన మందులు, ఎరువుల వాడకం వల్ల పంట భూములు సారవంతాన్ని కోల్పోతున్నాయన్నారు. రైతులు వాతావరణం, నేలలకు అనుగుణంగా రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రీయ ఎరువులను వాడుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ ఫరీదా, డాక్టర్ శివజ్యోతి, డాక్టర్ పీవి గీతాశిరీష, డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అల్లినగరంలో స్టాళ్ల ప్రదర్శన

అల్లినగరంలో జాతీయసేవా పథకంలో భాగంగా ఆరవ రోజు స్టూడెంట్స్ స్టాల్స్ ఏర్పాటు చేయడంతో పాటు రైతు నేల పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సుబ్బరామిరెడ్డి, డాక్టర్ త్రివిక్రమ్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వెలుగోడులో ఘనంగా ప్రపంచ నేల దినోత్సవం

వెలుగోడు: పట్టణంలోని జెడ్పీ హై స్కూల్‌లో గురువారం ఏఓ పవన్ కుమార్ ఆధ్వర్యంలో ప్రపంచ నేల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి వ్యవసాయ సహాయ సంచాలకులు ఆంజనేయ, జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ నరేంద్ర, యాగంటి పల్లి కేవీకే శాస్త్రవేత్త భార్గవ్, పాఠశాల హెచ్ఎం సత్యనారాయణ రావు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ మొక్కలకు అవసరమైన 18 రసాయన మూలకాలలో 15 మూలకాలు సహజంగా భూమి నుంచి లభిస్తాయని తెలిపారు. అయితే మానవ కార్యకలాపాల నేపథ్యంలో వాతావరణం మార్పులు, నేలలు క్షీణించ బడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్యాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువులను వాడి నేల ఆరోగ్యాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు.



స్టాళ్లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

నేలల సంరక్షణ అందరి బాధ్యత

మిడుతూరు: నేలలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని నందికొట్కూరు వ్యవసాయ సంచాలకులు విజయశేఖర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని చెరుకుచెర్ల గ్రామంలో ప్రపంచ నేల దినోత్సవం పురస్కరించుకుని నేల ప్రాముఖ్యత, నేల వనరుల స్థిరీకరణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, కోత, కాలుష్యాన్ని తగ్గించడం, నీటి చౌరబాటు, నిల్వను మెరుగు పరచడంవంటి పద్ధతులు నేల జీవవైవిధ్యాన్ని సంరక్షిస్తాయని చెప్పారు.

నందికొట్కూరు: ఆరోగ్యకరమైన నేలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఏడీఏ విజయశేఖర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని మల్యాల గ్రామ పొలిమేరలో ప్రపంచ నేల దినోత్సవ వేడుకలు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఆరోగ్యకకరమైన నేలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ప్రాముఖ్యతను ఇవ్వాలన్నారు. ఏఓ షేక్షావలి, తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: భూమిని కాపాడుకొంటే అది మానవాళిని కాపాడుతుందని జిల్లా వనరుల కేంద్రం ఏఓ హేమలత, మండల ఏఓ ఫణీశ్వరరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని మిట్టకందాల రైతుసేవాకేంద్రంలో భూ ఆరోగ్య దినోత్సవ కార్యక్రమం నిర్వహించా రు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రసాయనిక ఎరువులుఅధికంగా వాడటం వల్ల భూసాంద్రత తగ్గి భూమి నిస్సారవంతం అవుతుందన్నారు. కార్యక్రమ ంలో రైతుసేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

డ్రైనేజీల నిర్మాణానికి భూమిపూజ

జూపాడుబంగ్లా: మండలంలోని తాటిపాడు గ్రామంలోని దళితకాలనీల్లో డ్రైనేజీల నిర్మాణానికి సర్పంచ్ వంగల లక్ష్మిదేవి గురువారం భూమిపూజ చేశారు. రూ.10లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో దళితకాలనీల్లో డ్రైనేజీలు నిర్మించనున్నట్లు ఆమె తెలిపారు. డ్రైనేజీల నిర్మాణాలు పూర్తయితే కాలనీల్లో మురుగునీటి నిల్వల సమస్య తీరుతుందన్నారు. పనులు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో వంగల కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాసగౌడు, రాయపురంగారెడ్డి, మన్సూర్, లక్ష్మన్నగౌడు తదితరులు పాల్గొన్నారు.